క్లుప్తంగా

అలరిస్తున్న నాటికలు



వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్ర రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య ఆధ్వర్యంలో వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని చంద్రకళా వేదికపై నిర్వహిస్తున్న నవమ ఆహ్వాన పౌరాణిక పద్యనాటిక పోటీలు అలరిస్తున్నాయి. రెండో రోజు శుక్రవారం రాత్రి పటాన్‌చెరుకు చెందిన టీబీఆర్ ఆర్ట్స్ వారు స్వామి అయ్యప్ప, జడ్చర్లకు చెందిన నవజ్యోతి కళామండలి వారు మైరావణ నాటికలను ప్రదర్శించి మైమరిపించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య కన్వీనర్ వి.వి.సుబ్బారావు, అధ్యక్షులు పంపన వెంకటేశ్వర్‌రావు, బాబూరావు, సోమయాజులు, అచ్యుత రామయ్య, సూర్యనారాయణ, జైపాల్‌రెడ్డి, బుగ్గయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బాలసభ



బాలసభలో విద్యార్థులు

ఆమనగల్లు: బాలుర ఉన్నత పాఠశాలలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలసభ ఆకట్టుకుంది. పట్టణంలోని పాఠశాలలో ప్రతి శనివారం సభ చేపడుతున్నారు. ఇందులో విద్యార్థులే డీఈఓ, ఎంఈఓగా వ్యవహరిస్తూ సభను కొనసాగిస్తారు. కథలు చెప్పడం, పాటలు పాడటం, పొడుపుకథలు వేయడం, నృత్యాలు చేయడం లాంటివి చేస్తారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు పాండు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, మాధవి, సుజాత, జ్యోతి, మాలతి, వనిత, కుసుమలత, మేరి, నీలిమ, పద్మ, రమాదేవి, వందేమాతరం ఫౌండేషన్ వలంటీర్లు కవిత, శ్యామల పాల్గొన్నారు.

ఓటింగ్ విధానంపై అవగాహన అవసరం



ఎన్నికల అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

కడ్తాల్: ఎన్నికలు, ఓటింగ్ విధానంపై విద్యార్థులకు అవగాహన అవసరమని కృష్ణవేణి పాఠశాల ప్రిన్సిపాల్ ఈర్లపల్లి రవి అన్నారు. శనివారం పాఠశాలలో స్కూల్ ఎన్నికలు నిర్వహించారు. ఇందులో పాఠశాల అధ్యక్షుడిగా చందనశ్రీ, ఉపాధ్యక్షుడిగా మాన్సీ, ప్రధాన కార్యదర్శిగా చరణ్, సాంస్కృతిక కళ నిర్వాహక కార్యదర్శిగా మీనాక్షి తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం 2023–24 విద్యా సంవత్సరం పది పరీక్ష ఫలితాల్లో కార్తీక్ 10 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా కార్తీక్‌తో పాటు, అతని తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. పై చదువుల కోసం రూ.10 వేలు సాయం అందజేసింది. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దిలీప్‌రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

బోనాలకు విరాళం



చెక్కును అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: పోచమ్మ బోనాల ఉత్సవాలకు ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి రూ.51 వేల(చెక్కు)ను శనివారం మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం వద్ద ఉత్సవ కమిటీ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు సత్యంయాదవ్, రాములు, మల్లేశ్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్, నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, జహంగీర్‌అలీ, యాదయ్య, పాండు, మల్లయ్య, రాజేశ్, భాను కిరణ్, శ్రీకాంత్, శ్రీను, శేఖర్, చందు, మహేశ్, గణేశ్, రాజు ఉన్నారు.

30న ఆలయ భూముల కౌలుకు వేలం

ఇబ్రహీంపట్నం: రాయపోల్ గ్రామం వేణుగోపాలస్వామి దేవాలయానికి చెందిన భూములను కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 30న వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు వేలం చేపట్టనున్నామని పేర్కొన్నారు. 1 సెప్టెంబర్ 2024 నుంచి 31 ఆగస్టు 2025 వరకు భూములను కౌలుకు ఇస్తామని, ఆసక్తి గలవారు పాటలో పాల్గొనాలన్నారు.

ఉత్సవాలకు 'సూర్యగిరి' ముస్తాబు

రేపటి నుంచి మూడురోజుల పాటు వార్షికోత్సవాలు

- ఆలయంలో కొనసాగుతున్న పనులు
- భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు



ఎల్లమ్మ అమ్మవారు



సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం

తుక్కుగూడ: జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవాలకు ముస్తాబైంది. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు ఆలయానికి రంగులు వేస్తూ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమాల వివరాలు

ఈ నెల19 నుంచి 21వ తేదీ వరకూ 41వ వార్షికోత్సవాల సందర్భంగా ఘటము ఊరేగింపు, బోనాలు, కల్యాణం, అగ్నిగుండాలు తదితర కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాన్ని అత్యంత సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఈ ఉత్సవాలకు జిల్లాతో పాటు, హైదరాబాద్ మహానగరం, నల్గొండ, మహబూబ్‌నగర్ నుంచి వేలాది సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు, కానుకలు చెల్లించుకుంటారు. ప్రతి ఏడాది శ్రావణమాసం మూడో సోమవారం ఉత్సవాలు ప్రారంభమై బుధవారం ముగిస్తాయి.

కొనసాగుతున్న ఏర్పాట్లు

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి రంగులు వేయడం, ఆలయ ముందు పచ్చని చలువ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారి దర్శనం కోసం క్యూలో ఉండటానికి బారులు బిగిస్తున్నారు. వాహనాల పార్కింగ్‌కు ఆలయ సమీపంలోని భూములను చదును చేస్తున్నారు. రావిర్యాల నుంచి ఆలయం వరకు రోడ్లను శుభ్రం చేయిస్తున్నారు. వచ్చే భక్తులకు మంచినీటి వసతి, తదితర వసతులను కల్పిస్తున్నారు. ఏడాదికొకసారి జరిగే బోనాల ఉత్సవాలు కనుల పండవగా అత్యంత వైభవంగా జరగనున్నాయి.

ఉత్సవాలకు ఆహ్వానం

మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్‌తో పాటు వివిధ శాఖల అధికారులకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు.

“విజయవంతం చేయాలి

అమ్మవారి వార్షికోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. రేపటి నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలి.

– రెడ్డిగళ్ల రత్నం, ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్

కార్మికులను విస్మరించిన ప్రభుత్వం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్

మహేశ్వరం: దేశంలోని పలు రాష్ట్రాల ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి పాటుపడుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వారిని విస్మరించిందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో సీఐటీయూ, కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్డా కూలీ ధరల పట్టికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్మాణ రంగం కార్మికులకు ద్విచక్ర వాహనాలు, పింఛన్, రాయితీతో కూడిన పరికరాలు అందించడంతో పాటు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉపాధి కల్పిస్తుండగా.. తెలంగాణ సర్కార్.. సెస్సు ద్వారా వస్తున్న డబ్బులను దారి మళ్లించి అన్యాయం చేస్తుందని విమర్శించారు. ఆ నిధులను ఇతర రంగాలకు వినియోగించకుండా.. కార్మికుల సంక్షేమానికి ఉపయోగించి, వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. కార్మికులు సంక్షేమ బోర్డులో చేరి, లబ్ధిపొందాలని సూచించారు. కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమానికి సీఐటీయూ నిరంతరం పని చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవి కుమార్, జిల్లా కోశాధికారి కవిత, మండల అధ్యక్షుడు ఏర్పుల శేఖర్, నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు స్వర్ణగంటి చంద్రయ్య, కార్మిక సంఘం నాయకులు జోరల శ్రీశైలం, శంకర్, చెన్నయ్య, రాజు, రవి, రాములు, ప్రకాష్, యాదగిరి, మల్లేశ్, పర్వతాలు, కన్నయ్య, తిరుపతయ్య,, అచ్చయ్య పలువురు పాల్గొన్నారు.

గుడ్డుతో రోగనిరోధక శక్తి పెంపు



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న అతిథులు

వనస్థలిపురం: గుడ్డు తినడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని, ఆహారంలో గుడ్లకు ప్రత్యేక స్థానం ఇవ్వొచ్చని ఏఐజీ ఆసుపత్రి ఆహార శాస్త్రవేత్త, డా.పీవీ.సత్యనారాయణ అన్నారు. నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వనస్థలిపురంలోని కినారా గ్రాండ్ కాన్ఫరెన్స్‌హాల్లో నిర్వహించిన గుడ్డుపై అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మెదడు ఎదుగుదల, చిన్నపిల్లల పెరుగుదలకు కావాల్సిన పోషకాలు గుడ్డులో మెండుగా ఉంటాయన్నారు. కీటో డైట్ గురు నీలకంఠ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. గత ఆరు సంవత్సరాలుగా రోజు 6, 8, 10 గుడ్లు, కొబ్బరినూనెతో కీటో డైట్ చేస్తూ ఆరోగ్యంగా ఉన్నానని అన్నారు. డివిజన్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సైంటిస్ట్, ఎండీ డా.ఎస్.అరులప్ప మాట్లాడుతూ.. గుడ్లలో ఒమేగా 3 మంచి కొవ్వు పదార్థాలు ఉన్నందున కొలెస్ట్రాల్‌కు భయపడాల్సిన అవసరం లేదని, 6 నెలల వయస్సు పిల్లల నుంచి 60 ఏళ్ల వయస్సు పైబడిన వారు రోజు గుడ్లను భేషుగ్గా తినవచ్చన్నారు. అనంతరం నవంబర్‌లో జరిగే ఫౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్–2024కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అవేర్ గ్లోబల్ ఆసుపత్రి సీనియర్ కార్డియాలజిస్ట్ డా.మలిందర్ స్వామి, యశోద ఆసుపత్రి డైటీషియన్ సుజాత, డా.భరత్, డా. జానకీ శ్రీనాథ్, డా.జయసూర్య, తెలంగాణ ఫౌల్ట్రీ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర హెచరీస్ జీఎం ఆనంద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి కృషి



స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ చేసిన రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు బూడిద రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి కప్పపహాడ్ గ్రామంలో శనివారం 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు 80 మంది విద్యార్థులకు రూ.90 వేలను వెచ్చించి, క్రీడా దుస్తులు, షూలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను కొనసాగించి, విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. ఇందుకు దాతల సహకారం తప్పనిసరని, వారు ముందుకు రావాలని కోరారు. టీచర్లు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, ప్రయోజకులు కావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సతీష్‌గౌడ్, లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, సుధీర్ రెడ్డి, నర్సింహ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బూడిద మంజుల, ప్రభుదాస్, నరేష్, అశోక్, యాదయ్య, శైలం, శ్రీకాంత్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉపాధిహామీ సామాజిక తనిఖీ



కందుకూరులో ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

కందుకూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఉపాధిహామీ పనులకు సంబంధించి అధికారులు సామాజిక తనిఖీ చేపట్టారు. మండల పరిధిలోని 35 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ మధ్య జరిగిన ఉపాధిహామీ పనులపై గ్రామాల వారీగా డీఆర్పీఓ శ్రీలత, ఏపీడీ సక్రియానాయక్, అబుడ్స్‌మెన్ సునీత, జిల్లా విజిలెన్స్ అధికారి కొమురయ్య, ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో ఆడిట్ నిర్వహించారు. మొత్తం రూ.6.20 కోట్లు మంజూరు కాగా రూ.5.33 కోట్లు ఖర్చు చేశారు. అందులో కూలీల వేతనాలు రూ.5.29 కోట్లు, మెటీరియల్ ఖర్చులు రూ.4.48 లక్షలు ఖర్చు చేశారు. మొత్తం ఆరు వేల కుటుంబాలు 3.11 లక్షల పని దినాలు పూర్తిచేశాయి. వాటికి సంబంధించి పనుల వారీగా క్షుణ్ణంగా ఖర్చు చేసిన వివరాలను పరిశీలించారు. కొన్ని గ్రామాల్లో ఏడు రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడం, ధన్నారం, నేదునూరు, గుమ్మడవెల్లి, కొలన్‌గూడ తదితర గ్రామాల్లో మస్టర్‌లో కొట్టి వేతలు వంటి వాటిని గుర్తించారు. కాగా అన్ని గ్రామాలు పూర్తయ్యే వరకు రాత్రి అయినా సామాజిక తనిఖీ కొనసాగనుంది. కార్యక్రమంలో ఏపీఓ రవీందర్‌రెడ్డి, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

మహేశ్వరం: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు బైపాస్ రోడ్డు నిర్మిస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన బైపాస్ రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను నిరంతరం పనిచేస్తానని తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి బైపాస్ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు, మండల వాసులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. రోడ్డు నిర్మాణానికి రైతులతో మాట్లాడి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బైపాస్ రోడ్డు నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మహేశ్వరం అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. శివగంగ రాజరాజేశ్వర ఆలయం, దర్గాతో రోడ్డు విస్తరణకు అడ్డంకులు ఏర్పాడ్డాయని స్థానికులు కేఎల్లార్ దృష్టికి తీసుకెళ్లారు. మహేశ్వరం దినదినాభివృద్ధి చెందడంతో బైపాస్ రోడ్డు నిర్మించడం తప్పనిసరన్నారు. పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, అంధ్యానాయక్ పాల్గొన్నారు.

రహదారికి మోక్షం



సీసీ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ప్రజా ప్రతినిధులు

పహాడీషరీఫ్: పెండింగ్‌లో ఉన్న జల్‌పల్లి గ్రామం పాఠశాల చౌరస్తా నుంచి మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లే రహదారికి మోక్షం లభించింది. రూ.16 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు.. పాఠశాల రోడ్డు నుంచి మసీద్ వరకు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కొనసాగుతున్న నిర్మాణ పనులను శనివారం కౌన్సిలర్ బుడుమాల యాదగిరి, బీఆర్‌ఎస్ నాయకులు షేక్ అఫ్జల్, సయీద్ పటేల్‌లు పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడారు. డ్రైనేజీ పైప్‌లైన్లు వేసి సుదీర్ఘ కాలం వదిలేయడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడేవారని చెప్పారు. ఇదే విషయమై.. పలుమార్లు దినపత్రికల్లో వార్త కథనం ప్రచురితం అయిందని పేర్కొన్నారు. ఎట్టకేలకు అధికారులు స్పందించి, రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు.

ఓపీ నిలిపి.. నిరసన బాట

- వైద్యురాలి హత్య ఉదంతంపై వైద్యుల ఆందోళన
- నిందితులను శిక్షించాలంటూ డిమాండ్
- వైద్యసేవలు అందక రోగుల ఇబ్బంది



ఆమనగల్లులో.. ర్యాలీ తీస్తున్న వైద్యసిబ్బంది

ఇబ్రహీంపట్నం: కోల్‌కతాలో ఇటీవల యువ వైద్యురాలిని లైంగికంగా వేధించి హతమార్చిన సంఘటన దేశవ్యాప్త ఆందోళనకు దారి తీసింది. ఇందులో భాగంగా శనివారం జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల వైద్య సిబ్బంది ఓపీ సేవలను నిలిపివేసి, నిరసన బాటపట్టారు. ఇబ్రహీంపట్నంలో నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు జవహర్‌లాల్, కీర్తన, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉరి తీయాలి

ట్రైనీ వైద్యురాలిని హతమార్చిన దుండగులను ఉరి తీయాలని లిమ్స్ అస్పత్రి ఎండీ, డాక్టర్ విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు లిమ్స్ వైద్య సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడారు. హత్య ఘటనలో నిందితులు ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో అస్పత్రి మేనేజర్ బాషా, వైద్య సిబ్బంది శశికాంత్, శివశంకర్, సతీష్‌నాయక్, ఖాదర్, రమేష్, సరోజ పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: వైద్యురాలిని పాశవికంగా హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ నరేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు, ఆశా కార్యకర్తలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంయుక్తంగా భారీ ర్యాలీ తీశారు. జాతీయ రహదారి రాజీవ్ కూడలిలో మానవహారం నిర్వహించారు.



ఇబ్రహీంపట్నంలో ర్యాలీలో ప్రభుత్వ వైద్యసిబ్బంది

తెరచుకోని ఓపి విభాగం



రోగులకు మందులు ఇస్తున్న నర్సులు

పట్నంలోని సర్కారు దవాఖాన ఔట్ పేషెంట్స్ విభాగం తలుపులు తెరుచుకోలేదు. దీంతో వైద్యం కోసం వచ్చిన రోగులు తిరిగి వెళ్లిపోయారు. అత్యవసరం ఉన్న రోగులకు నర్సులు మందులు పంపిణీ చేశారు.

“కళ్లు తిరిగినట్లుంటే



కళ్లు తిరిగినట్లుగా ఉంటే వైద్యం చేయించుకునేందుకు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాను. ఓపీ విభాగం తీయలేదు. దీంతో ఆర్‌ఎంపీ వైద్యుడి వద్ద బీపీ చెక్ చేయించుకొని, మందులు తీసుకున్నాను.

– బుచ్చప్ప, ఇబ్రహీంపట్నం

సుస్తుగా ఉందని..



సుస్తుగా ఉందని ఆస్పత్రికి వెళ్లాను. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడ్డాను. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకొని మందులు తీసుకున్నాను.

– సోమమ్మ, ఇబ్రహీంపట్నం

భారతి సిమెంట్‌కు తిరుగులేదు



ప్రమాద బీమా బాండ్లను అందజేస్తున్న మహ్మద్ సాహెర్

హస్తినాపురం: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రా ఫస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహెర్ తెలిపారు. హనుమాన్‌నగర్‌కాలనీలోని శ్రీరామస్టీల్ ట్రేడర్ డీలర్ షాపులో ఏర్పాటు చేసిన తాపీ మేస్త్రీల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫస్ట్ ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జీలు, రహదారుల నిర్మాణానికి ఎంతగానో ఉపయోగకరమని, వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని స్లాబ్, కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ పడతారని వెల్లడించారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ. లక్ష ప్రమాద భీమా బాండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్లు రాంరెడ్డి, కృష్టారెడ్డి, మార్కెటింగ్ డిప్యూటీ మేనేజర్ రామకృష్ణ, టెక్నికల్ ఆఫీసర్ బద్రీ పాల్గొన్నారు.

చెరువులను పరిరక్షించాలి



తహసీల్దార్‌కు వనతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

హయత్‌నగర్: కొందరు అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చేతులు కలపడంతో చెరువులు, కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయని సీపీఎం నాయకులు ఆరోపించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం తహసీల్దార్ రవీందర్ దత్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టిఅన్నారంలోని సర్వే నంబర్1లో తట్టిఖానా చెరువును కొందరు క్రమంగా పూడ్చివేస్తున్నారని, ఇదే విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. ఇదే గ్రామంలోని ఊర చెరువులో నీరు నిల్వకుండా చేసి, చెరువు ఉనికి లేకుండా చేయాలని చూస్తున్నారని చెప్పారు. ఇక్కడే గాలకుంట చెరువును పూడ్చి వేసి విల్లాల నిర్మాణం చేపడుతున్నారని, పక్కనే ఉన్న జంగారెడ్డి కుంటను పూడ్చి రోడ్డు నిర్మించినా ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అధికారుల చేతి వాటంతోనే రియల్టర్లు కబ్జాలకు పాల్పడుతున్నారని వెల్లడించారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువుల ఆక్రమణదారులు, వారికి సహకరిస్తున్న వారిపై తగిన చర్యలు కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ, ముత్యాలు, గుండె నర్సింహ, మేడిపల్లి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.